
కథ

# వాలుజడ - వాయిల్ చీర

తిరుమలశ్రీ



'అజంతా సుందరి'లా కాకపోయినా, అందంగానే వుంది అమ్మాయి అనుకున్నాడు గోపాలం. పెళ్లి చూపుల కోసం రాయంచలా నడిచి వచ్చి అతని ఎదుట కూర్చున్నదామె.

ఆమె వదనారవిందాన్నీ, సౌందర్యాన్నీ కాక– ఆమె హెయిర్‌స్టైల్‌ని, దుస్తులను పరీక్షగా చూశాడు గోపాలం. మెడవరకు అందంగా కత్తిరించుకున్న జుత్తు, ఆరెంజ్‌కలర్ చుడీదార్...''ప్చ్,ఈ అమ్మాయి రుచి నా అభిరుచికి చుక్కెదురులా వుంది'' అనుకున్నాడు.

"మీ అమ్మాయితో కొంచెం విడిగా మాట్లాడాలి" అని అతను అడగడంతో, కాదనలేకపోయాడు అమ్మాయి తండ్రి.

అమ్మాయి వెనుకే గదిలోకి ప్రవేశించాడు గోపాలం. తలవంచుకుని నిలుచున్న ఆమె వైపు చూస్తూ, "మీరు నాకు నచ్చారు, నచ్చనిదల్లా మీ జుట్టు, కట్టే!" అన్నాడు సూటిగా విషయంలోకి వస్తూ.

చటుక్కున తలెత్తి చురుగ్గా అతని ముఖంలోకి చూసిందామె.

"ఐ మీన్...నాకు వాలుజడంటే బోలెడంత ఇష్టం. కాని, మీరు జుత్తు కత్తిరించుకున్నారు." అన్నాడు నసుగుతూ.

జవాబివ్వలేదామె.

"మరో విషయం...మీకు వాయిల్ చీరలంటే ఇష్టమేనా?" అడిగాడు.

ముఖం వికారంగా పెట్టి "సిల్క్స్, సింథటిక్సు విరివిగా దొరికే ఈ కాలంలో కూడా...వాయిల్సూ, కాటన్సూ కట్టుకోవలసిన ఖర్మేమిటీ?" అందామె.

"ఒక వేళ పెళ్లయ్యాక నేను మిమ్మల్ని వాలుజడ వేసుకోమనీ, వాయిల్ చీర కట్టుకోమనీ పట్టుపడితేనో?"

జవాబివ్వకుండా విసవిసా హాల్లోకి నడిచిందామె. "డాడీ! ఈ బీసీ నాటి బాయ్‌ని నేను చచ్చినా పెళ్లిచేసుకోను" అని తెగేసి చెప్పేసింది.

తెల్లబోయారంతా.

కొడుకు వంక అనుమానంగా చూసింది శ్యామలమ్మ.

"ఏమన్నావురా ఆ అమ్మాయినీ?" నడిగింది విస్తుపోతూ.

"మమ్మీ! మా అభిరుచులు కలవడం లేదు. లెటజ్ గో" అన్నాడు గోపాలం బయటకు నడుస్తూ.

చిన్నగా నుదురు కొట్టుకుంటూ కొడుకును అనుసరించింది ఆవిడ.

★★★

అసలు గోపాలానికి వాలుజడ, వాయిల్ చీరల మీద అంత గాఢమైన మక్కువ ఏర్పడ్డానికి కారణం తెలుసుకోవాలంటే- అతని యూనివర్శిటీ లైఫ్‌లోకి తొంగి చూడవలసిందే...

యూనివర్శిటీలో గోపాలం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేస్తున్న రోజులవి...వివిధ స్ట్రీమ్స్‌కి చెందిన అమ్మాయిలు రకరకాల మోడర్న్ డ్రెస్‌లతో, హెయిర్ స్టయిల్స్‌తో రంగుల సీతాకోక చిలుకల్లా క్యాంపస్‌లో తిరుగాడుతుంటే కన్నుల పండువగా వుండేది అబ్బాయిలకు. అమ్మాయిల అందాలను, ఫ్యాషన్లనూ చూసి ఫ్లాట్ అయిపోయేవారు. వారితో పరిచయాలు పెంచుకోవాలని తహతహలాడేవారు.

అటువంటి వాతావరణంలో కిరణ్మయి పరిచయం- గ్రీష్మ తాపంలో చందనపు లేపనంలా అనిపించింది గోపాలానికి. కిరణ్మయి కూడా ఫస్టియర్ పీజీ స్టూడెంటే. పొలిటికల్ సైన్స్ చదువుతోంది. స్టన్నింగ్ బ్యూటీ కాకపోయినా, సహజ సౌందర్యం ఆమెది. నల్లటి, వొత్తైన, పొడవాటి వాలుజడ.. సుందర జలపాతంలా జాలువారుతూ, నడుస్తూంటే ఆమె పిరుదులపైన అందంగా కదులుతూంటుంది. ఆమె పొందికగా కట్టుకునే వాయిల్ చీరలు ఎంతో రిఫ్రెషింగ్‌గా అనిపించేవి కంటికి.

ఓ కల్చరల్ ప్రోగ్రాంలో కిరణ్మయితో పరిచయమయింది గోపాలానికి. ఆమె అందం, నెమ్మదితనం, సింప్లిసిటీ ఎంతగానో ఆకట్టుకున్నాయి అతన్ని. ఆ క్షణంలోనే అనిపించింది అతనికి, అమ్మాయంటే అలా వుండాలని.

ఫ్యాకల్టీస్ వేరైనా తరచు క్యాంపస్‌లో ఎదురు పడుతుండేవారు ఇద్దరూ. ఆమె కనిపించినపుడల్లా ఉత్సాహంగా పలకరించేవాడు గోపాలం. స్నేహపూరితమైన చిరునవ్వు వెలువడేది ఆమె అధరాలపైన... ఆమె రూపం మదిలో గాఢంగా ముద్ర పడిపోవడంతో, తనకు కాబోయే భార్య అలాగే ఉండాలనిపించింది గోపాలానికి. ముఖ్యంగా వాలుజడా, వాయిల్ చీరా అతని హృదయంలో హత్తుకుపోయాయి.

చూస్తుండగానే పీజీ రెండేళ్ళు గడిచి పోయాయి. ఆ మధ్య కాలంలో గోపాలం, కిరణ్మయిల పరిచయం అభివృద్ధి చెందింది. పలకరింపుల నుంచి కలుసుకొని మాట్లాడుకోవడం వరకు...చిరునవ్వుల నుంచి జోకులు వేసుకుని హాయిగా నవ్వుకునేంత వరకు వచ్చింది. అలాగని అతి చనువు తీసుకోలేదు ఎన్నడూనూ. ఒకరి గురించి ఒకరికి తెలిసింది తక్కువే. ఆమె మదిలో ఏముందో గాని, గోపాలం మాత్రం ఆమెను తన అర్ధాంగిని చేసుకోవాలన్న ఆశలను పెంచుకున్నాడు.



పరీక్షలు పూర్తయ్యాక తల్లిదండ్రులతో చెప్పి ఆమె పెద్దలతో మాట్లాడించాలనుకున్నాడు. చివరి రోజున విడిపోతూ అడ్రస్‌లు ఎక్స్ఛేంజ్ చేసుకున్నారు కూడా.

''త్వరలోనే మిమ్మల్ని కలుస్తాను'' అని గోపాలం నర్మగర్భంగా అంటే, చిరునవ్వు నవ్విందామె.

అయితే విధి గోపాలాన్ని చూసి వంకరనవ్వు నవ్వడంతో, వారం రోజులకే గోపాలం తండ్రి హార్ట్ ఎటాక్‌తో మరణించడం జరిగింది. ఆ విపత్తు నుంచి కోలుకుని మాములు మనిషి అయ్యేసరికి కొంతకాలం పట్టింది గోపాలానికి.

కిరణ్మయి కోసం విచారిస్తే, తన. అన్నయ్య దగ్గరకు ఢిల్లీ వెళ్ళిపోయిందని తెలిసింది.

అదంతా జరిగి మూడేళ్ళయిపోయింది. అయినా కిరణ్మయి అతని మది నుంచి తొలగిపోలేదు. ఆమెను పొందే అదృష్టం పోగొట్టుకున్నా- ఆమెలా వాలుజడ, వాయిల్ చీరలపైనా మక్కువ చూపే మగువనే తన అర్ధాంగిని చేసుకోవాలన్న దృఢ నిశ్చయానికి వచ్చాడు.

గోపాలానికి ఓ ప్రైవేట్ సెక్టార్ కంపెనీలో జాబ్ వచ్చింది. అప్పట్నుంచి తల్లి శ్యామలమ్మ పెళ్లి సంబంధాలు చూస్తూనే వుంది. అందమైన అమ్మాయిలు, మోడర్న్ గర్ల్స్, సాంప్రదాయ కుటుంబాలకు చెందిన వారు అయినా- ఒక్కర్నీ ఓకే చేయని కొడుకును చూస్తుంటే అసహనం పెరిగిపోతోంది ఆవిడలో. 'వాలుజడా- వాయిల్ చీర' అంటూ పిచ్చిపిచ్చిగా వాగుతూ, చూసిన సంబంధమల్లా చెడగొట్టుకుంటూంటే- ''కొడుకును ఏ వాయిల్ చీర దయ్యమో పట్టుకోలేదు గదా!'' అన్న అనుమానం కూడా కలిగింది. ఎందుకైనా మంచిదని, అతనికి తెలీకుండా మంత్రించిన తాయెత్తు ఒకటి తెచ్చి నిద్రపోతున్నప్పుడు అతని చేతికి కట్టేసింది.

★★★

గోపాలం పెళ్లిచూపులు అతని కోలీగ్స్‌కి ఓ తమాషా పర్వం అయింది.అతను ఎప్పుడూ పెళ్లిచూపులకు వెళ్ళొచ్చినా తెగ ఏడిపిస్తుంటారు. అయినా ఉడుక్కోడు అతను. వారితో పాటే ఎంజాయ్ చేస్తూంటాడు.

''ఏరా గోపాలం, ఈ సారీ ఏ అంట కత్తెర అమ్మాయో ఎదురయిందా?'' అని ఒకరు...''ఏ మిడ్డీనో, మిడిగ్రుడ్ల అమ్మాయి తగిలిందా?'' అని ఇంకొకరు.. ''ఈ రోజుల్లో మరీ కత్తెరపడని జుత్తు కావాలంటే ఎలా గురూ?'' అని ఆట పట్టించేవారు గోపాలాన్ని.

''నా అభిరుచులు ఆలకించి...నన్ను బీసీ నాటి బాయ్ అని బ్రాండ్ చేసేసేందిరా'' అని చెప్పి గోపాలం నవ్వుతుంటే అతనితో శృతి కలిపారంతా.

వారి సంభాషణను ఆలకిస్తున్న మరో కోలీగ్ శకుంతల, ''నీ టేస్ట్ తెలిసాక నిన్ను వేస్ట్‌గాడనుకుని వుంటుంది! అయినా బెండకాయ ముదిరితే సాంబారులోకైనా పనికొస్తుందేమో గాని, బ్రహ్మాచారి ముదిరితే సంసారానికి పనికి రాడు'' అంది.

''ఏం చక్కగా వాలుజడ వేసుకుని వయ్యారాలు పోతూ మా మతులు చెడగొట్టడం లేదూ నువ్వు? పాము కుబుసం లాంటి వాయిల్ శారీస్‌లో మా గుండెల్లో గుబులు రేపడం లేదూ?'' జవాబిచ్చాడు గోపాలం.

శకుంతలకు ముప్పయేళ్ళుంటాయి. వయస్సులోనూ, ఉద్యోగంలోనూ గోపాలానికి సీనియర్. పిరుదులనంటే వాలుజడ, జడలో పూలతో చూడముచ్చటగా వుంటుంది. ఎప్పుడూ ఆరెంజ్ కాటన్ వాయిల్ శారీస్ కడుతూంటుంది. కొలీగ్స్‌తో కలుపుగోలుగా వుంటుంది.

''పోనీ, నన్నే చేసుకోరాదు నువ్వు?'' అంది శకుంతల.

''మీ ఆయన ఒప్పుకుంటే నాకేమీ అభ్యంతరం లేదు'' అన్నాడు గోపాలం నవ్వుతూ.''అసలు నువ్వు ముందే కనిపించి వుంటే నిన్నే పెళ్ళాడేవాణ్ణి!''

''ఇపుడు మాత్రం మించిపోయిందేముందీ! మా ఆయన దగ్గర విడాకులు తీసుకుని వచ్చేస్తాను. కాకపోతే నాతోపాటే ఇద్దరు పిల్లలూను'' అంది శకుంతల.

''ఇంకా నయం, మీ ఆయన్ని కూడా వెంట పెట్టుకొస్తాననలేదు! నాక్కావాల్సింది నీ అభిరుచులే కాని, నీ ఎటాచ్‌మెంట్స్ కాదు'' అంటూ కొట్టిపారేశాడు గోపాలం.

''ఓరీ దుర్మార్గుడా! నా పిల్లల్ని నా నుంచి దూరం చేయాలనుకుంటున్నావా? నీకిదే నా శాపం! జ్యోతిలక్ష్మి డ్రెస్ తోడూ హెలెన్ హెయిర్ స్టైల్ గల పిల్ల నీ పెళ్లాం అగుగాక! అందామె సీరియస్‌గా ఫేస్ పెట్టి.

''అమ్మా, తల్లీ! నాకు పెళ్లికాకపోయినా పరవాలేదు గాని, అలాంటి పిల్లలను మాత్రం నాకు అంటగట్టకు'' అన్నాడు గోపాలం చేతులు జోడించి నమస్కారం పెట్టేస్తూ.

కాసేపు అక్కడ నవ్వులు పండాయి.

★★★

గోపాలం మేనమామ రంగనాథం విజయవాడలో వుంటున్నాడు. ఆయన గుంటూరులో మంచి సంబంధం వుందని రాస్తే, కొడుకుతో వెళ్లింది శ్యామలమ్మ.

అమ్మాయి తెల్లగా, దంతపు బొమ్మలా వుంది. బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తుందట... ఆమె బాబ్డ్ హెయిరూ, మాడర్న్ డ్రెస్సూ చూసి గోపాలం గతుక్కుమన్నాడు. ఇన్నాళ్లూ తల్లిని కాబట్టి దబాయించేసాడు. ఇప్పుడు మేనమామ పక్కనున్నాడు. ఆ పిల్ల తనకు నచ్చకపోవడానికి అసలు కారణం చెబితే అక్కడే ఉతికి ఆరేస్తాడు తనను. గోపాలం ఆలోచనలో పడ్డాడు.

అంతలో- ట్రేలో ఫలహారాలు పట్టుకొచ్చింది ఓ యువతి. వాటిని సెర్వ్ చేస్తూండగా ఆమె గిర్రున తిరగడమూ , పొడవాటి ఆమె జడ గోపాలం ముఖానికి సున్నితంగా తగలడమూ జరిగాయి. చటుక్కున తలెత్తి ఆమె వంక చూసాడు.

''సారీ!'' అంటూ ఎపాలిజెటిక్‌గా అతని ముఖంలోకి చూసిందామె. బారులు తీరిన గండు తుమ్మెదల్లా నల్లగా వున్న పొడవాటి వాలు జడ..వైట్ కలర్ కాటన్ వాయిల్ శారీ!

అతను నోరు తెరుచుకుని ఆమె వదనంలోకి చూస్తూండడం గమనించిన పెళ్లి కూతురి తండ్రి,''ఈ అమ్మాయి నా మేనకోడలు. ఢిల్లీలో ఉద్యోగం చేస్తోంది'' అన్నాడు పరిచయం చేస్తూ.

గోపాలం కన్నుల్లో కోటి కాంతులు!


''కిరణ్మయి!'' అన్న పలుకులు అప్రయత్నంగా అతని పెదవుల నుండి వెలువడ్డాయి.

''గోపాలం...!'' అంది ఆమె కూడా విస్మయంతో.

ఆమెను పరిశీలనగా చూసాడు గోపాలం. ఆ మూడేళ్ళలో ఆమెలో ఏ మార్పు లేదు.

అంతా విస్తుపోయి చూస్తుంటే,''మేము యూనివర్శిటీమేట్స్‌మి'' అన్నాడు గోపాలం నవ్వుతూ.

తరువాత, ''ఎక్స్‌క్యూజ్ మీ'' అంటూ లేచి,





# ఐష్ పారితోషికం ఆరుకోట్లు...

**హీ**రోయిన్లకి పెళ్లితో గడ్డుకాలం ప్రారంభమవుతుందంటారు. గత పది సంవత్సరాలుగా తన అందచందాలతో సినీరంగాన్ని ఏలుతున్న మాజీ అందాల సుందరి, బచ్చన్ కోడలైన ఐశ్వర్యారాయ్ విషయంలో మాత్రం దీనికి మినహాయింపు కనపడుతోంది. ఈ సుందరికి పెళ్లి అయినా హీరోయిన్‌గా గ్లామర్ ఏమాత్రం తగ్గకపోగా రోజురోజుకీ పెరిగిపోతూనే వుంది. దీనికి తాజా నిదర్శనం శంకర్, రజనీకాంత్‌ల 'రోబో'లో హీరోయిన్‌గా ఐశ్వర్యరాయ్ అత్యధిక పారితోషికానికి ఎంపిక కావడమే. ఇప్పటి వరకూ ఐశ్వర్యారాయ్ బాలీవుడ్‌లో రెండు కోట్ల రూపాయల పారితోషికాన్ని, హాలీవుడ్‌లో నాలుగు కోట్ల పారితోషికాన్ని అందుకున్న ఆమె 'రోబో' చిత్రానికి ఆరుకోట్ల రూపాయలను పుచ్చుకోబోతోంది. భారతదేశ సినిమా చరిత్రలో ఒక హీరోయిన్ ఇంత అత్యధిక పారితోషికాన్ని తీసుకోవడం ఇదే ప్రథమం. తెలుగు, తమిళ్, హిందీ మూడు భాషల్లో 130 కోట్ల రూపాయల వ్యయంతోఅత్యంత భారీగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఆసియా ఖండంలోనే చరిత్ర సృష్టిస్తుందని చెపుతున్నారు. రోబో చరిత్ర సృష్టించినా, సృష్టించకపోయినా ఐష్ మాత్రం తన అత్యధిక పారితోషికంతో కచ్చితంగా చరిత్ర సృష్టించింది. ఏప్రిల్ 8వ తేదీని రోబో షూటింగ్ ప్రారంభం అవుతుందని భావిస్తున్నారు.

తల్లిని చేయి పట్టుకుని, హాలు బయటవున్న వరండాలోకి లాక్కుపోయాడు.

కిరణ్మయి గురించీ, ఆమె పట్ల తనకున్న ప్రేమ గురించీ, ఆమెకు తానంటే ఇష్టమనీ, అనుకోకుండా తాము దూరమైన వైనమూ, తన 'వాలుజడ-వాయిల్‌చీర' కాన్సెప్ట్‌కి మూలం ఆమెననీ- అంతా వివరించి చెప్పాడు. ఇప్పుడు కిరణ్మయి అనుకోకుండా తారసపడటం తన అదృష్టమనీ, తాను ఆమెనే పెళ్ళాడుతాననీ చెప్పాడు.

శ్యామలమ్మ తెల్లబోయింది. ఒక అమ్మాయిని చూడ్డానికి వచ్చి మరో అమ్మాయిని చేసుకుంటాననడం సభ్యత, సంస్కారము కాదనీ, పెళ్లి కూతురి మనసు గాయపరచడమే కాక, వారి కుటుంబాలతో కలతలు రేగే ప్రమాదం కూడా వుందనీ...కొడుక్కి బోధించిందావిడ. పై పెచ్చు, మేనమామ కూతుర్ని చూడ్డానికి వచ్చినవాడు తనను చేసుకుంటానంటే కిరణ్మయి కూడా వొప్పుకోదంది.

గోపాలం వినిపించుకోలేదు. కిరణ్మయి కాదంటే జీవితంలో మళ్ళీ పెళ్లి మాటే తలపెట్టనన్నాడు... అరగంట సేపు తర్జనభర్జనల అనంతరం కొడుకు దారికి రాక తప్పలేదు ఆ తల్లికి. అన్న గారిని ప్రక్కకు పిలిచి విషయం నెమ్మదిగా వివరించింది. రంగనాథం ముఖంలో రంగులు మారాయి. కాని, ఏమీ అనలేని పరిస్థితి!

రంగనాథం ముందుగా అమ్మాయిని లోపలికి తీసుకు వెళ్లమని చెప్పాడు. తరువాత కిరణ్మయి గురించి ఒక్కొక్కటిగా వివరాలు అడగనారంభించాడు. చెబుతూ, తన చెల్లెల్ని- కిరణ్మయి తల్లిని పరిచయం చేసాడు పెళ్లి కూతురి తండ్రి...

రంగనాథం అసలు సంగతి చల్లగా బయటపెట్టడంతో నిర్ఘాంతపోయారంతా. పెళ్లి కూతురి తండ్రి వదనం వివర్ణమయింది. అయితే అది క్షణికం మాత్రమే. ముఖంలోకి నవ్వు తెచ్చుకుని, "మా అమ్మాయికి అనుకున్న అబ్బాయి చేజారిపోవడం నిరుత్సాహం కలిగించినా...అతను కోరుకునేది మా ఫ్యామిలీలోని అమ్మాయే- అదీ నా చెల్లెలి కూతురే కావడం సంతోషదాయకమే. మా కిరణ్‌ని కూడా ఓ మాట అడిగి ఈ సంబంధం ఖాయం చేసుకోవడానికి మాకు అభ్యంతరం లేదు" అన్నాడతను మనస్ఫూర్తిగా.

తన వదినకు అనుకున్న సంబంధం తాను చేసుకోవడానికి మొదట కిరణ్మయి ఒప్పుకోలేదు. అది- తాను ఇష్టపడుతున్న గోపాలం అయినా సరే! కాని, తాను కాదన్నంతలో అతను ఆ అమ్మాయిని చేసుకోడనీ, అసలు పెళ్లే చేసుకోనంటున్నాడనీ ఆలకించడంతో దిగివచ్చింది. వదిన కూడా ఆమెను ఒప్పించింది.

కిరణ్మయి అంగీకరించడంతో- వారి వివాహానికి ముహూర్తం కూడా నిర్ణయించేసారు పెద్దలు.

★★★

శోభనం నాటి రాత్రి-

పాలగ్లాసుతో గదిలో అడుగుపెట్టింది కిరణ్మయి.

ఓ క్షణం రెప్ప వేయకుండా ఆమె వంక చూసాడు గోపాలం...

ఎలాంటి ప్రత్యేకాలంకరణలకు పోకుండా ఎప్పటిలాగే సింపుల్‌గా తయారైంది. తెల్లటి మల్లెపూవులాంటి ఆరెంజ్ వాయిల్‌చీర... నల్లత్రాచులా వీపు మీద ప్రాకుతూ, గుండ్రటి పిరుదుల పైన ఆమె అడుగులకు లయగా నర్తిస్తోన్న వాలుజడ...ముగ్ధమనోహరంగా వుంది.

ఆమెను సమీపించి వీపు చుట్టూ చేతులు వేసాడు,"కిరణ్!" అంటూ సిగ్గుల మొగ్గే అయిందామె.

అతను ఆమె అధరాలను అందుకోబోతే, జడతో కొంటెగా కొట్టింది. "అబ్బాయి గారికి కావాల్సింది వాలుజడ, వాయిల్ చీరేగాని... అమ్మాయి మనసు, సొగసు కాదుగా! మరెందుకీ చిలిపిచేష్టలు?" అంది చురకవేస్తూ.

"ఉహూఁ! అమ్మాయి మనసు,సొగసుల తర్వాతే అవన్నీనని ఇప్పుడే తెలిసింది!" అంటూ ఆమెను హృదయానికి హత్తుకున్నాడు.

అతని ఆత్రం గమనించి ఆమె కిలకిలమంటే... ఆమె వాలుజడ అతని ముఖానికి కితకితలు పెట్టింది.

ఆ మనోహర దృశ్యానికి పరవశించిన వాయిల్ చీర సిగ్గుతో వైదొలగడంతో- ఆ జంటకు శుభరాత్రే అయింది.

★